
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



వనపర్తి

జిల్లా వార్తలు

శుక్రవారం 18 ఏప్రిల్ 2025

ఉష్ణోగ్రతలు గరిష్ఠం : 41.1 । కనిష్ఠం : 24.5



బుధవారం మల్దకల్ మండలంలో పట్టుబడ్డ నకిలీ పత్తి విత్తనాలు

నడిగడ్డలో.. నకిలీ దందా

- వానకాలానికి ముందే నకిలీ విత్తనాల కలకలం
- మల్దకల్ మండలంలో పోలీసుల దాడులు
- 51 బస్తాల లూజు విత్తనాలు స్వాధీనం
- సీడ్ ఆర్గనైజర్లే అసలు సూత్రధారులు

జోగులాంబ గద్వాల జిల్లాలో కల్తీ విత్తనాలు కలకలం రేపుతున్నాయి. బుధవారం పోలీసుల దాడుల్లో మల్దకల్ మండలంలోని, కుర్తిరావులచెర్వు గ్రామంలో 51 బస్తాల నకిలీ పత్తివిత్తనాలు పట్టుబడ్డాయి. సీజన్ ప్రారంభం కాకముందే అక్రమార్కులు నకిలీ దందాకు తెరలేపడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వివిధ రాష్ట్రాల్లో ఫెయిల్ అయిన విత్తనాలను అక్రమ మార్గంలో తీసుకొచ్చి రైతులకు అంటగడుతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. నకిలీ విత్తనాల విక్రయాలకు ఆర్గనైజర్లే సూత్రధారులని ప్రచారం జరుగుతోంది. అధికారులు స్పందించి నకిలీ విత్తనాలను కట్టడి చేయకపోతే తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు వస్తాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- అయిజ టౌన్, ఆంధ్రజ్యోతి

7



సమావేశంలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

శాశ్వత పరిష్కారానికే భూ భారతి

- నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్

వంగూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం 'భూ భారతి' తీసుకువచ్చిందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు తహసీల్దార్ కార్యాలయంలో 'భూ భారతి' పై గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించి భూ సమస్యల శాశ్వత పరిష్కారా నికి ప్రభుత్వం భూ భారతిని రూపొందించిందన్నారు. ఈ నూతన రెవెన్యూ చట్టంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అమరేందర్, రాష్ట వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి, తహసీల్దార్ మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిజ జీవితాలను ప్రతిబింబించే నాటకాలు

- ఎమ్మెల్సీ గోరటి వెంకన్న
- నాగర్‌కర్నూల్‌లో చింతామణి నాటక ప్రదర్శన

6

అరుదైన జాతికి.. ఆదరణేదీ..?

- తూర్పుజాతి గిత్తకు గుర్తింపు కరువు




- గోధుమరంగు మచ్చలు, నిలువైన కొమ్ములతో పశువులు..
- రెండు రోజులు మేత లేకున్నా పనిచేసే శక్తి గల ఎద్దులు..
- వాతావరణ పరిస్థితులను అంచనా వేయడంలో దిట్ట

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : శత్రువును పసిగట్టే చురుకుదనం.. రెండు రోజులు మేత లేకున్నా యజమానికి సాయపడే శక్తి... గుట్టలు, రాళ్ల మధ్య పోడు వ్యవసాయం చేస్తున్న వారికి అండగా నిలబడే తత్వం.. వందల సంవత్సరాల వారసత్వం కలిగిన తూర్పుజాతి గిత్తల లక్షణమిది. నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల అటవీ ప్రాంతంలో తూర్పు జాతి గిత్తలు వాటి సంతతికి విశిష్టత ఉన్నది. ఇక్కడి భౌగోళిక స్వరూపం, వాతావరణ పరిస్థితులు, నల్లమల రైతుల ఆర్థిక స్థితిగతులకు అనుగుణంగా తూర్పు జాతి పశువులు అన్నదాతలకు అండగా నిలుస్తున్నాయి. వీటి ప్రత్యేకత ఏంటంటే... వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేయడం, వర్షం వచ్చే సూచనలు కూడా యజమానికి వివిధ సంకేతాల ద్వారా చేరవేయడం గమనార్హం.

నల్లమలలో వీటికి ప్రత్యేక స్థానం

తూర్పు జాతి పశువులు నల్లమలలో మాత్రమే కన్పిస్తాయి. నాగర్‌కర్నూల్, నల్గొండ జిల్లాల వరకు విస్తరించి ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో అమ్రాబాద్, పదర, ఉప్పునుంతల, అచ్చంపేట, లింగాల ప్రాంతాల్లో ఈ జాతి పశువులు ఉన్నాయి. 15 నుంచి 20 సంవత్సరాల వరకు వీటి జీవితకాలం. తెల్లటి శరీరంపై గోధుమ రంగు మచ్చలు, నిలువైన కొమ్ములతో ఈ జాతి పశువులు ఇట్టే ఆకర్షిస్తాయి. తరచూ నల్లమల అటవీ ప్రాంతంలో సంచరిస్తున్న కారణంగా మృగాల బారి నుంచి రక్షించుకోవడానికి వీటికి సహజసిద్ధంగా నిలువైన కొమ్ములు ఏర్పడ్డాయి. అటవీ ప్రాంతంలో అనేక ఔషధ మొక్కలను ఆహా రంగా తీసుకోవడంతో వీటి ఆరోగ్య సామర్థ్యం కూడా మెరుగ్గా ఉంటుందని పశువైద్య నిపుణులు అంటున్నారు. అధికారుల అంచనా మేరకు అచ్చంపేట, అమ్రాబాద్, ఉప్పునుం తల, పదర, లింగాల మండలా ల్లో 11,572 తూర్పు జాతి ఆవులు, 1421 ఎద్దులు, 5,436 లేగ దూడలు న్నట్లు గణాకాంలున్నాయి.



నల్లమలలోఅరుదైన తూర్పు జాతి గిత్త

తెలంగాణ గిత్తగా గుర్తింపెన్నడు?

అరుదైన తూర్పు జాతి గిత్తను జాతీయ పశువుల జాబితాలో చేర్చాలని కేంద్ర ప్రభుత్వానికి గడిచిన 12 ఏళ్లుగా అనేక విజ్ఞప్తులు వెళ్లాయి. ఈ క్రమంలో నల్లమలలోని అరుదైన తూర్పు జాతి పశువులపై నేషనల్ బోర్డు ఫర్ యానిమల్ జినేటిక్ రిసోర్సెస్ అనే సంస్థ తూర్పు సంతతిని జాతీయ వారసత్వంగా గుర్తించాలని ప్రతిపాదించింది. ఈ అంశాన్ని వాటర్ షెడ్ సపోర్ట్ సర్వీసెస్ అండ్ యాక్టివిటీ అనే నెట్‌వర్క్ కూడా తూర్పు జాతి విశేషాలను గుర్తించ డానికి దాదాపు రెండేళ్లపాటు అనేక అధ్యయనాలు చేసింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు గిత్త, తమిళనాడుకు చెందిన పులికులం సంతతి ఉన్నాయి. తూర్పు జాతికి చెందిన గిత్తకు కూడా అంతర్జాతీయ గుర్తింపును తీసుకొస్తే వాటి సంరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేకంగా ప్రయత్నిస్తున్నాయనే సంకల్పంతో నివేదికను అందించి పదేళ్ల కావస్తున్నా ఈ అంశం కొలిక్కి రావడం లేదు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అప్పటి ప్రభుత్వం తూర్పు జాతి గిత్తను తెలంగాణ గిత్తగా గుర్తిస్తామని ప్రకటించి అందుకు సంబంధించిన నివేదికలు తెప్పించుకున్నప్పటికీ తగిన గుర్తింపు రాలేదు. పాలక ప్రభుత్వాలు ఇదే తాత్సార ధోరణిని అవలంబిస్తే అరుదైన తూర్పు జాతి పశువులు ఆచూకీ లేకుండా పోయే ప్రమాదం ఉందని నల్లమల వాసులు ఆందోళన చెందుతున్నారు.

ప్రమాదకర ప్రాంతంలో.. శిథిలాల తొలగింపు

- కార్మికుల ఆచూకీ కోసం సాగుతున్న అన్వేషణ
- ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి
- డీ-2 ప్రాంతంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

7



సొరంగంలో డీ 2 ప్రాంతంలో ఎక్స్‌కవేటర్ల సహాయంతో చేపడుతున్న పనులు

పేద రైతులకు న్యాయం చేస్తాం

- ధరణిలో కొల్లగొట్టిన లక్షల ఎకరాల భూములను రాబడతాం..
- కోర్టులో లేని అన్ని భూవివాదాల పరిష్కారానికి చర్యలు
- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- నారాయణపేట జిల్లా ఖాజీపూర్‌లో భూభారతి సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

భూభారతి చట్టం ముఖ్యమంత్రి, రెవెన్యూ మంత్రుల మానస పుత్రిక..



14 నెలల మేధావుల శ్రమతో రూపకల్పన చేసిన భూ భారతి చట్టం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల మానస పుత్రిక. పేద రైతుల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి ఈ చట్టం తీసుకొచ్చి దేశానికే ఆదర్శంగా నిలిచింది. నియోకవర్గంలోని రైతులకు అవగాహన పర్చి వారికి ఎదురైన భూసమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తా.

- వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే మక్తల్

మద్దూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): ధరణిలో లక్షల ఎకరాల పేదల భూమిని గత పాలకులు కొల్లగొట్టారని వాటిని భూభారతి చట్టం ద్వారా రాబట్టి.. పేద రైతులకు న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు పర్చబోయే భూభారతి చట్టం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఈ చట్టంపై అవగాహన కల్పించేందుకు పైలట్ ప్రాజెక్టు కింద ఎంపికైన నారాయణపేట జిల్లా మద్దూర్ మండలంలోని ఖాజీపూర్‌లో గురువారం ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు మంత్రి హాజరై మాట్లాడారు. వచ్చే నెలలో అన్ని మండలాల్లో కలెక్టర్‌తో చట్టంపై రైతులకు అవగాహన సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పలు రాష్ట్రాల చట్టాలను పరిశీలించి 14 నెలల పాటు మేధావులు చర్చించి, శ్రమించి ఎలాంటి లోపంలేని విధంగా ఈ చట్టం రూపకల్పన చేయనున్నట్లు చెప్పారు. కొత్త చట్టం అమలైతే కాంగ్రెస్‌కు ఎక్కడ పేరు వస్తోందని ప్రతిపక్ష నాయకులు అబద్ధపు ప్రచారాలు చేయడం జరుగుతోందన్నారు. హక్కులు కల్గిన రైతులకు భూమిని సంక్రమింప చేయడమే ప్రభుత్వ విధానమన్నారు. రికార్డుల్లో చిన్న తప్పు ఉన్నా సొంత భూమిని అమ్ముకోలేని పరిస్థితి

-మిగతా 6లో..

సమీక్షలకే సరి..

- సిద్ధంకాని కేంద్రాలు, రైస్ మిల్లులు
- వర్షాలకు భయపడుతున్న రైతులు
- మార్కెట్‌కు పోటెత్తుతున్న ధాన్యం

నేటికీ ప్రారంభం కాని ధాన్యం కొనుగోళ్లు



మార్కెట్‌లో కుప్పలుగా పోసిన ధాన్యం

గద్వాల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో నేటికీ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించలేదు. అకాల వర్షాలతో ధాన్యాన్ని రక్షించుకునేందుకు అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో క్రయవిక్రయాలు ప్రారంభించకపోవడంతో మార్కెట్‌కు తీసుకువెళ్తున్నారు. దీంతో గద్వాల మార్కెట్‌కు ధాన్యం పోటెత్తుతోంది.

జిల్లాలో 68,896 ఎకరాలలో వరి సాగు

గద్వాల జిల్లాలో వరి 68,896 ఎకరాలలో సాగు చేశారు. దాదాపు 1.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు అంచనా వేశారు. అందుకు అనుగుణంగా 69 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు ఐకేపీ ఆధ్వర్యంలో 15, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 5 కేంద్రాలను ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు ఒక్క గింజను కూడా కొనుగోలు చేయలేదు. కనీసం రైస్‌మిల్లులను కూడా సిద్ధం చేయలేదు. వానకాలంలో 37మిల్లులతో అగ్రిమెంట్లు చేసుకున్నారు. ఇప్పుడు కూడా వారికే ఇచ్చే అవకాశం ఉన్నప్పటికీ వారితో అగ్రిమెంట్లు చేయలేదు. అదేవిధంగా 43.75 లక్షల గన్నీబ్యాగులు అవసరం అవుతాయని అంచనా వేశారు. ప్రస్తుతం 5 లక్షల బ్యాగులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరో 19 లక్షలు గన్నీ బ్యాగులకు ఇండెంట్ పెట్టారు. ఎప్పుడు వస్తాయో తెలియదు. మిగతా వాటిని రెండో విడతలో తీసుకోనున్నట్లు అధికారులు తెలిపారు.

మార్కెట్‌కు పోటెత్తుతున్న ధాన్యం

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరించకపోవడంతో అకాల వర్షాల భయంతో అన్నదాతలు ఐదు రోజుల నుంచి గద్వాల వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం తీసుకువస్తున్నారు. 12వ తేదీన 1724, 15వ తేదీన 3,475, 16వ తేదీన 3,183 సంచుల ధాన్యం మార్కెట్‌కు తీసుకువచ్చారు. గరిష్ఠంగా క్వింటాలుకు ధర రూ.2080 ఉండగా కనిష్ఠంగా ధర రూ.1703ల ధర పలుకుతోంది. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో అన్నదాతలు ప్రభుత్వం చెల్లిస్తున్న మద్దతు ధరతో పాటు బోనస్‌ను కోల్పోతున్నారు.

వరి కోత యంత్రం రిపేర్ చేస్తూ యువకుడి మృతి

వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండలంలోని మోట్లంపల్లిలో సంఘటన



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ నరేందర్

వెంకటేష్ (ఫైల్)

6

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు

- రెండు బైకులు ఢీకొని ఇద్దరు - వాహనం ఢీకొని ఒకరు
- ద్విచక్రవాహనం ఢీకొని మరొకరు..

7

వేర్వేరు కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష

- హత్య కేసులో దోషికి పదేళ్లు..

హాయిగా.. ఆనందంగా..

- ఈతపై చిన్నారుల ఆసక్తి
- స్విమ్మింగ్ పూల్‌లకు పెరిగిన రద్దీ

6



పట్టణంలోని స్విమ్మింగ్ పూల్



వనపర్తి పట్టణంలోని తపాలా కార్యాలయం ముందు నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లెల చిన్నారెడ్డి



ఖిల్లాఘణపురం రహదారిపై కూర్చొని నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

తప్పుడు కేసులతో.. భయపెట్టలేరు

- రాజకీయ కుట్రతోనే సోనియాగాంధీ, రాహుల్‌గాంధీలపై కేసులు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి
- ప్రధాని మోదీ కక్షసాధింపు చర్యలు మానుకోవాలి
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి టౌన్/ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కుట్రలతో తప్పుడు కేసులు పెట్టి కాంగ్రెస్ పార్టీని భయపెట్టలేరని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ కేసును వ్యతిరేకిస్తు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం వనపర్తి పట్టణంలోని తపాలా కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్ గాంధీలపై కేసు నమోదు చేయడం కేవలం రాజకీయ కక్షలే కారణమన్నారు. వేల కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టి విదేశాలకు పారిపోయిన దొంగలను వదిలేసి, దేశం కోసం ప్రాణాలను బలిచ్చిన కుటుంబాన్ని ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండి పడ్డారు. అనంతరం బీజేపీ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

రోడ్డుపై బైఠాయించిన ఎమ్మెల్యే మేఘారెడ్డి

బీజేపీ ప్రభుత్వం సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని గురువారం ఖిల్లాఘణపురం బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై ఎమ్మెల్యే మేఘారెడ్డి బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ జాతీయ నాయకులపై అక్రమంగా ఈడీ కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాక్షేత్రంలో బీజేపీకి భంగపాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, కోట్ల రవి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ బాబా, రాగివేణు, సమ్మద్, చీర్ల జనార్దన్, ఖిల్లాఘణపురంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు విజయ్ కుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ మురళీధర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఈదురు గాలులతో మోస్తరు వర్షం

» కరెంట్ సరఫరా నిలిపివేతతో ప్రజల ఇక్కట్లు

నారాయణపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): నారాయణపేటలో గురువారం సాయంత్రం ఈదులు గాలులతో ఓ మోస్తరు వర్షంకు రిసింది. ఈదురు గాలులతో పట్టణంలో విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. రాత్రి ఏడున్నర గంటలు దాటినా విద్యుత్ సరఫరా కాకపోవడంతో ఓ వైపు అంధ కారం.. మరో వైపు ఈదురు గాలుల వర్షంతో ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఇళ్లలో కరెంట్ లేక ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. కాగా, నారాయణపేట సివిల్‌లైన్ సబ్‌జైల్ దగ్గర చెట్టు కూలిపోయి వైర్లు కలిసి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఎర్రగు ట్ట ఐటీఐ కాలేజీ దగ్గర టీన్ రేకుల షెడ్ గాలికి ఎగిరి పడటంతో విద్యుత్ తీగలకు తగిలి అంతరాయం ఏర్పడింది. రాత్రి తొమ్మిది గంటల వరకు విద్యుత్ అంతరాయంతో ప్రజలు నానా ఇబ్బంది లకు లోనయ్యారు.

మెడికల్ కౌన్సిల్‌కు ఫిర్యాదు

జడ్చర్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : లేని విద్యార్హతలతో అలోపతి వైద్యం అందిస్తున్నారంటూ జడ్చర్ల పట్టణానికి చెందిన ఇద్దరు వైద్యులపై తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ మహేష్‌కు మార్, రిజిస్ట్రార్ డాక్టర్ దండం లాలయ్యకుమార్ ఫిర్యాదు చేసినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. జడ్చర్ల పట్టణంలోని బంగారు మైసమ్మ దేవాలయ సమీపంలో హోమి యోపతి డిగ్రీ కలిగి ఉండి, అలోపతి వైద్యం చేస్తున్న డాక్టర్ రమేశ్‌బాబుపై, పట్టణంలోని గాంధీచౌరస్తాలో ఆర్‌ఎంపీగా ఉన్న రాజశేఖర్‌గౌడ్ సైతం అర్హతలేని అలోపతి వైద్య చికి త్సలు నిర్వహిస్తున్నాడంటూ తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు ఫి ర్యాదు చేసారని, ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆలయ భూములు కౌలుకు వేలం

జడ్చర్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గంగా పురం చెన్నకేశవస్వామి ఆలయ భూములు కౌలుకు గురువారం ఆలయ ఆవరణలో దేవాదాయశాఖ పర్యవేక్షకురాలు వీణాధరి, ఆలయ ఈవో దీప్తిరెడ్డి సమక్షంలో వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన 9 మంది రైతులు శివకుమార్, వెంకటయ్య, భీమయ్య, వెంకటయ్య, ఆంజనే యులు, నాగస్వామి, గోపాల్, గోపాల్‌యాదవ్, సుధాకర్‌రెడ్డి వేలంలో కౌలుకు తీసుకున్నారు. ఆలయానికి చెందిన 115 ఎకరాలను 9 మంది రైతులు ఒక సంవత్సరంకు రూ.5.23 లక్షలకు కౌలుకు తీసుకున్నారు. వీరికి ఏప్రిల్ 17, 2025 నుంచి ఏప్రిల్ 16, 2026 వరకు కౌలుకు ఇచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

వరి కోత యంత్రం రిపేర్ చేస్తూ యువకుడి మృతి

ఆత్మకూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వరి కోత యంత్రాన్ని మరమ్మతు చేస్తుండగా కట్టర్ బాడీ మీద పడటంతో ఓ యువకుడు మృతి చెందాడు. వనపర్తి జిల్లా, ఆత్మకూరు మండల పరిధిలోని మోట్లంపల్లి గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఆత్మకూరు ఎస్‌ఐ నరేంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి వెంకటేశ్ (30) తన సొంత వరి కోత యంత్రాన్ని నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మేడపల్లి శివారులోని గొల్ల నాగన్న పొలంలో వరి కోత కోసం డ్రైవర్ మన్యం గురువారం ఉదయం హార్వెస్టర్‌ను తీసుకెళ్లాడు. కానీ కట్టర్ బాడీ పనిచేయక పోవడంతో అతడు వెంకటేశ్‌కు ఫోన్ చేశాడు. దీంతో అతడు అక్కడికి చేరుకొని కట్టర్ కిందకు వెళ్లి మరమ్మతు చేస్తున్నాడు. అదే సమయంలో డ్రైవర్ మ న్యం కట్టర్‌ను లాక్ చేయకుండా, ఆయిల్ సీల్‌ను తీసేయడంతో అది వెంకటేశ్‌పై పడింది. దీంతో తీవ్రంగా గాయపడిన అతడిని రైతు నాగన్న డ్రైవర్ మన్యం సహాయంతో ఆత్మకూరు ప్రభుత్వ ఆసు పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం వనపర్తి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషయమించడంతో అంబులెన్సులో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందాడు. డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే తమ అల్లుడు మృతి చెందాడని మామ పెద్ద ఆంజనేయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా మని ఎస్‌ఐ నరేందర్ తెలిపారు.

బాలికను వేధిస్తున్న యువకుడిపై కేసు

మిడ్జిల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మిడ్జిల్ ఎస్‌ఐ శివనాగేశ్వ ర్‌నాయుడు గురువారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను, అదే గ్రామానికి చెందిన యువకుడు కొంత కాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ విషయంపై బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. బాలికలను వేధించినా, పెళ్లి చేసుకునేందుకు ప్రయత్నించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత; కేసు నమోదు

గద్వాల క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ఫ్లై ఓవర్ సమీపంలో గురువారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. గద్వాల మండలం గోనుపాడు నుంచి గద్వాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండుగా పట్టుకొని, ట్రాక్టర్ యజమాని బోయ శ్రీను, డ్రైవర్ బోయ రామకృష్ణపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాన్‌గల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అన్నారం - దావాజీపల్లి గ్రామాల మధ్యలో రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో వనపర్తి మండలం నాగవరానికి చెందిన దేవేందర్(47) హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ కస్టడీకి గ్యాంగ్ రేప్ నిందితులు

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన నాగర్‌కర్నూలు జిల్లా ఊర్కొండ పేట గ్యాంగ్ రేప్ ఘటనలో గురువారం ఏడుగురు నిందితులను కల్వకుర్తి పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. మార్చి 29న ఊర్కొండ పేటలో దైవ దర్శనానికి వచ్చిన వివాహితపై గ్యాంగ్‌రేప్ జరిగిన విషయం తెలిసిందే. బాధితురాలు మార్చి 31న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన అనంతరం ఏప్రిల్ 2న నిందితులు మారుపాకుల ఆంజనేయులు, ఎండి.సాధిక్ బాబా, వాగుల్‌దాస్ మణికంఠ, కార్తీక్‌గౌడ్, మట్ట మహేష్‌గౌడ్, హరీశ్‌గౌడ్, మట్ట ఆంజనేయులును అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. 15 రోజుల రిమాండ్ విధించిన అనంతరం కల్వకుర్తి కోర్టు నిందితులను పోలీస్ కస్టడీకి అప్పగిస్తూ నిర్ణయాన్ని వెలిబుచ్చింది.

పోక్సో కేసులో నిందితుడికి 25 ఏళ్ల శిక్ష

నారాయణపేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టులో గురువారం పోక్సో నిందితుడు మండ్ల బాలరాజుపై నేరం రుజువుకావడంతో జిల్లా ప్రధాన న్యాయాధికారి మహమ్మద్‌రఫి 25 ఏళ్ల జైలు శిక్ష, రూ.15వేల జరిమానా విధించినట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్ ప్రకటనలో తెలిపారు. నారాయణపేట రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలికను కొల్లంపల్లికి చెందిన మండ్ల బాల్‌రాజ్ పదోతరగతి నుంచి ప్రేమిస్తున్నానని వెంటపడి, ఇంటర్ చదివే సమయంలో మయామాటలు చెప్పి ఇంట్లో ఎవరూ లేని సమయంలో గతేడాది జనవరి 17న లైంగికదాడికి పాల్పడినట్లు బాలిక తండ్రి ఫిర్యాదు చేశాడు. అదేవిధంగా బాలికను ఎత్తుకెళ్లి పెళ్లి చేసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. కూతురి అదృశ్యంపై ఫిర్యాదు చేయగా గతేడాది జూన్ 28 తీసుకొచ్చి కొల్లంపల్లి గేటు వద్ద వదిలి వెళ్లగా, అదే రోజు పేట రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసును ఏఎస్‌ఐ సంజీవయ్య నమోదు చేశారు. ఎస్‌ఐలు జయప్రసాద్, కృష్ణదేవ్, సీఐ శివశంకర్ విచారించి కోర్టులో చార్జిషీటు నమోదు చేశారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఏఎస్‌ఐ కృష్ణయ్యగౌడ్, కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ విజయ్‌కుమార్, రాజు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. పీపీ ఆకుల బాలప్ప వాదనలు వినిపించి కేసు నిరూపణతో జిల్లా న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు పేర్కొన్నారు.





స్విమ్మింగ్‌పూల్‌లో ఈత కొడుతున్న చిన్నారులు

హాయిగా.. ఆనందంగా..

» ఈతపై చిన్నారుల ఆసక్తి
» స్విమ్మింగ్ పూల్‌లకు పెరిగిన రద్దీ
» ప్రమాణాలు పాటిస్తున్న కొలనులనే ఎంచుకోవాలి
» నీటి గుంతలు, చెరువులకు వెళ్లడం ప్రమాదకరం
» సూచిస్తున్న ఎస్పీ, డీవైఎస్‌వో

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వేసవిలో ఉక్కపోత నుంచి ఉపశమనం పొందేందుకు చిన్నారులతో పాటు పెద్దలు ఈత కొలునుల బాట పడుతున్నారు. ఒకప్పుడు వేసవి వచ్చిందంటే గ్రామీణ ప్రాంతాల్లో ఈత కొట్టేందుకు, నేర్చుకునేందుకు బావులు, చెరువులకు వెళ్లేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. పట్టణాలతో పాటు, మండల కేంద్రాల్లోనూ ఈత కొలునులు వెలిశాయి. దీంతో చిన్న పిల్లలతో పాటు పెద్దవారు కూడా ఈత కోసం స్విమ్మింగ్‌పూల్స్‌కు వెళ్తున్నారు. అయితే వాటిని ఎక్కడపడితే అక్కడ అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తుండటం ప్రమాదాలకు కారణమవుతోంది. కొన్ని చోట్ల కోచ్‌లు కూడా లేకపోవడం సమస్యగా మారింది. ఈ విషయాన్ని తల్లిదండ్రులు గమనంలో ఉంచుకోవాలని ఉన్నతాధికారులు, క్రీడా శాఖ అధికారులు సూచిస్తున్నారు. కోచ్‌లు అందుబాటులో ఉండే, అనుమతి ఉన్న ఈత కొలనులకే వెళ్లాలని చెప్తున్నారు.

సెలవుల్లో పెరుగుతున్న రద్దీ

రోజురోజుకు ఎండలు తీవ్రం కావడంతో ప్రతీ రోజూ చిన్నారులు, పెద్దలు ఈత కొట్టేందుకు వెళ్తుండటంతో స్విమ్మింగ్‌పూల్స్ వద్ద రద్దీ పెరుగుతోంది. వారాంతాలు, సెలవు రోజుల్లో రద్దీ మరింత ఎక్కువగా ఉంటోంది. పూల్‌లో ఈత కొట్టేందుకు నిర్వాహకులు గంటలకు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నారు. కొన్ని చోట్ల నెలకు ఒకే సారి రూ. 2 వేల నుంచి రూ. 3 వేల వరకు ఫీజు తీసుకుంటున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

చిన్నారులకు ఈత నేర్పించే తల్లిదండ్రులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. పిల్లలు కొలనులో 3 ఫీట్ల లోతు నీటిలో మాత్రమే ఈత కొట్టాలి. కోచ్, లైఫ్ సేవర్ల సాయంతో ఈత నేర్చుకోవాలి. ఈత పూర్తిగా వచ్చిన తర్వాత 6 అడుగులు, 9 అడుగుల లోతుకు వెళ్లాలి. ఈత కొట్టేవారు, నేర్చుకునే వారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తలపై టోపీ, ట్యూబుతోనే నీళ్లలో దిగాలి. కళ్లలోకి నీరు పోకుండా తప్పనిసరిగా ప్రత్యేక అద్దాలు పెట్టుకోవాలి. కొలనులో ఎన్‌ఐఎస్ కోచ్‌లు తప్పని సరిగా ఉండాలి. స్విమ్మింగ్‌పూల్‌లో దిగిన అందరు చిన్నారులపైనా వారి పర్యవేక్షణ ఉండాలి. ఎక్కడా ఎలాంటి తప్పిదం జరుగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి. కొలనులోని నీటిని నిత్యం శుద్ధి చేయాల్సి ఉంటుంది. లేకుంటే కంటి చూపుపై ప్రభావం పడుతుంది. చర్మవ్యాధుల బారిపడే ప్రమాదం కూడా ఉంది.

ఉమ్మడి జిల్లాలో 14 పైగా ఈత కొలనులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 14కు పైగా ఈత కొలనులు ఉన్నాయి. జిల్లా స్పోర్ట్స్ ఆథారిటీ (డీఎస్‌ఏ) ఆధ్వర్యంలో నిర్వహించే ఈత కొలను మహబూబ్‌నగర్‌లో మాత్రమే ఉంది. మిగతా చోట్ల ఉన్న స్విమింగ్ పూల్స్‌కు అనుమతులు లేవు. భద్రత ప్రమాణాలు కూడా పాటించట్లేదు. ఈ విషయంపై క్రీడాశాఖ అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. ఈత కొలనులపై పర్యవేక్షణ ఉండాలని, అనుమతి లేని, నిబంధనలు పాటించని కొలునులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే చాలామంది యువకులు క్వారీ గుంతలు, చెరువుల్లో ఈత కొట్టేందుకు వెళ్తున్నారు. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఈతకు వెళ్లి ఐదుగురు చనిపోయారు. పట్టణంలోని మెడికల్ కళాశాల పక్కనే ఉన్న క్వారీ గుంతల్లో ఈత కొట్టేందుకు వెళ్లి ముగ్గురు యువకులు మృతి చెందారు.

చిన్నారులపై పర్యవేక్షణ ఉండాలి



వేసవి సెలవులు వస్తూనే గ్రామీణ ప్రాంతాల్లో బావులు, చెరువుల్లో ఈత నేర్చుకునేందుకు పిల్లలతో పాటు యువకులు కూడా వెళ్తుంటారు. చిన్నారులు నీటిలో ఆడుకోవడానికి ఇష్టపడతారు. ఈత రాని పిల్లలను నీటి వద్దకు పంపించొద్దు. తల్లిదండ్రులు దగ్గరుండి ఈత నేర్పించాలి. స్విమ్మింగ్ పూల్స్ నిర్వ హకులు బాలురకు, బాలికలకు వేర్వేరు సమయాల్లో ఈత నే ర్పించాలి. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం.

- డి.జానకి,
ఎస్పీ, మహబూబ్‌నగర్.

అనుమతులు తీసుకోవాలి



స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటు, నిర్వహణకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలి. ఈత కొట్టేందుకు, నేర్చుకునేందుకు వచ్చే పిల్లలను నిర్వాహకులు, కోచ్‌లు, లైఫ్‌సేవర్లు పర్యవేక్షిస్తుండాలి. ఎక్కడా చిన్న తప్పి దం జరగకుండా బాధ్యతగా వ్యవహరించాలి. తల్లిదండ్రులు కూడా నిష్ణాతులైన కోచ్‌లు, అనుమతులు ఉన్న స్విమ్మింగ్ పూల్స్‌కే పిల్లలను పంపించాలి. అన్ని రకాల భద్రత, రక్షణ సామగ్రి కొలను వద్ద అందుబాటులో ఉండాలి.

- ఎస్. శ్రీనివాస్,
డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్.

పేద రైతులకు న్యాయం చేస్తాం

(5వ పేజీ తరువాయి)

ఉండేదనాన్నారు. వీటిని సరి చేసేందుకు జిల్లా కార్యాలయాల చుట్టూ రైతులు తిరిగినా ఫలితం దక్కని ధరణి వల్ల ఉండేదన్నారు. వాటిలో ఉన్న చిక్కులు పేద రైతుల కష్టాలకు కారణంగా ఉండేదన్నారు. ధరణీ వల్ల రైతులు పడుతున్న కష్టాలు చూసిన ముఖ్యమంత్రి అధికారంలోకి రాగానే దానిని పాతాళగంగలో విసురుతామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకే రైతుల కష్టాలను దూరం చేసేందకు భూభారతి చట్టం తీసుకువచ్చారన్నారు. దీనిని రాష్ట్ర వ్యాప్తంగా అమలు పరిచి రైతులకు తమ భూములపై భరోసా కల్పించనున్నట్లు తెలిపారు.

ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు తమ భూ సమస్యలను మంత్రి దృష్టి తీసుకొచ్చారు. వారి దరఖాస్తులను స్వయంగా మంత్రే తీసుకున్నారు. న్యాయమైన అన్ని భూ సమస్యలు పరిష్కార మార్గం లభిస్తోందని మంత్రి రైతులకు భరోసా ఇచ్చారు. అంతకు ముందు కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు రెవెన్యూ కలెక్టర్ బెన్‌షాలం చట్టం గురించి వివరించారు. గ్రామానికి వచ్చిన మంత్రి, ఇతర శాసనసభ్యులకు గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు.

మక్తల్, నారాయణపేట, పరిగి ఎమ్మెల్యేలు శ్రీహరి, పర్ణికారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కాడా అధికారి వెంకట్‌రెడ్డి, ఆర్డీవో రాంచందర్, తహసీల్దార్ మహేష్‌గౌడ్ , ఎంపీడీవో నర్సింహా రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు నర్సింహ, మార్కెట్ కమిటీ చైర్మన్ భీములు, జడ్పీటీసీ మాజీ సభ్యు డు రఘపతిరెడ్డి, మండల నాయకులు ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మద్దూర్ మండలంల ఖాజీపూర్ గ్రామ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

సైడ్ లైట్స్

కొత్తపల్లి,(ఆంధ్రజ్యోతి) : మద్దూర్ మండలంలోని ఖాజీపూర్ గ్రామానికి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉదయం 9:35 నిమిషాలకు చేరుకున్నారు. మొదటగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేశారు. అక్కడి నుంచి కాలినడకతో స్టేజి దగరకు 9:40 చేరుకున్నారు. నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్ 9:48 నుంచి 9:55గంటల వరకు ప్రసంగించారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి 10:29 నుంచి 10:40 వరకు గత ప్రభుత్వంలో ధరణి ద్వారా ఆయన పడిన ఇబ్బందులు, అలాగే రైతులు పడిన కష్టాల గురించి తెలిపారు. అనంతరం గ్రామానికి చెందిన నాయకులు వీరారెడ్డి రైతు ధరణి ద్వారా ఆ గ్రామ ప్రజలు పడిన ఇబ్బందుల గురించి గుర్తు చేశారు. 10:42 నుంచి 10:45 వరకు మాట్లాడారు. 10:46 నుంచి 10:50 వరకు కళాకారుల భూ భారతిపై పాట పాడారు. 10:50నుంచి 10:51 వరకు అదే గ్రామానికి చెందిన రైతు యొక్క ఆవేదన తెలిపారు. 10:54నుంచి 11:17 వరకు మంత్రి పొంగులెట్టి శ్రీనివాస్ రెడ్డి భూ భారతిపై ప్రసంగించారు. అనంతరం గ్రామానికి చెందిన మహిళలతో స్టేజి దిగే ముందు మాట్లాడారు.


ప్రజల కష్టం తెలిసిన వ్యక్తి రేవంత్‌రెడ్డి



ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకోబోయే నిర్ణయాలన్నీ ఆ మేరకే ఉంటాయి. కొత్త చట్టం ద్వారా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తోంది. స్థానికంగానే రైతుల భూ కష్టాలు తీర్చేందుకు తీసుకున్న నిర్ణయం అభినందనీయం.

- సీతా దయాకర్‌రెడ్డి, బాలల హక్కుల కమిషన్ చైర్‌పర్సన్


వందేళ్లయినా రైతుల హక్కులకు భంగం కల్గదు..



ప్రభుత్వం అమలు చేయబోయే నూతన భూ చట్టంతో వందేళ్లయినా రైతులకు భవిష్యత్తులో ఎలాంటి సమస్య తలెత్తకుండా ఉంటోంది. పక్కాగా వివరాల నమోదు, భూహక్కులను కల్గిస్తోంది.

- తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ
కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి

భూభారతితో రైతులకు మేలు..



ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి చట్టం అమలు చరిత్రలో నిలిచిపోతుంది. ఈ చట్టం రైతులకు ఎంతో మేలు కలుగుతోంది. ఆధార్ కార్డుల మాదిరిగానే భూమికి సంబంధించిన అన్ని వివరాలతో భూధార్ కార్డుల జారీని ప్రభుత్వం రాబోయే రోజుల్లో తీసుకొచ్చే ప్రయత్నం కొనసాగుతోంది.

- రాంమోహన్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే

కొత్త చట్టం ఓ ఆయుధం లాంటిది



భూసమస్యల పరిష్కారానికి ఈ చట్టం రైతులకు ఓ ఆయుధంగా మారుతుంది. ఎలాంటి సమస్యనైనా స్థానికంగానే పరిష్కరించే అవకాశం కొత్త చట్టం కల్పిస్తోంది. ప్రచారం సందర్భంగా తాను ఎక్కువ శాతం భూసమస్యలే తమ దృష్టికి వచ్చాయి. వాటినన్నిటికీ పరిష్కారమా ర్గం లభించే అవకాశం ఏర్పడింది.

- పర్ణికారెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే

పశువులకు టీకాలు వేయించాలి

» పశువైద్యాధికారి రాజు

అమ్రాబాద్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : రైతులు పాడి పశువులు, ఎదులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని అమ్రాబాద్ పశువైద్యాధికారి డాక్టర్ వి.రాజు తెలిపారు. మండల కేంద్రంలోని పలువురు రైతులకు చెందిన పశువులకు పశు వైద్య సిబ్బందితో కలిసి టీకాలు వేసినట్లు తెలిపారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం మే నెలాఖరు వరకు ఉంటుందని తెలిపారు. పశువైద్య సిబ్బంది గోపాలు, మిత్రలు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి

చారకొండ : పశువులకు ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ శివకుమార్ అన్నారు. గురువారం చారకొండతో పాటు మండలంలోని జూపల్లిలో పశువైద్య శిబిరాలను ఏర్పాటు చేసి 228 ఆవులు, 97 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో శివరాం, గిరిబాబు యాదవ్, రైతులు పాల్గొన్నారు.



అమ్రాబాద్‌లో గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి డాక్టర్ రాజు

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

తిమ్మాజిపేట : గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొడుపర్తి, చేగుంట, రాళ్లచెరువుతండాల్లో గురువారం నిర్వహించిన పశువైద్య శిబిరాల్లో 465 తెల్లజాతి పశువులకు, 542 నల్లజాతి పశువులకు టీకాలు వేశారు. పశువైద్యాధికారి శ్రావణి, సిబ్బంది తిరుపతయ్య, విజయ, లలిత, యాదగిరి, శాంతయ్య, రవి, గోపాలమిత్రలు స్వామి, జగ్జీవన్, మన్మథ ఉన్నారు.

జోగుళాంబ సన్నిధిలో ఎమ్మెల్సీ

» స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు



దర్శనానికి వస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి

అలంపూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి గురువారం జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. అంతకుముందు ఆయనకు అర్చకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం స్వామి సన్నిధిలో గణపతి పూజ, అభిషేకం నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఆ తర్వాత ఆయనను ఘనంగా సత్కరించారు. ఆయన వెంట పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పేరి వెంకట్ రెడ్డి, జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకట్రామయ్య శెట్టి, జిల్లా అధ్యక్షుడు మచ్చర్ల తిమ్మారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బీఎస్ వేణుగోపాల్, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న హుండీ లెక్కింపు



తిమ్మారెడ్డిపల్లి బావోజి ఆలయ ప్రాంగణంలో హుండీ లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది, అధికారులు

కొత్తపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డి పల్లిలో బావోజీ ఆలయ హుండీ లెక్కింపు కొనసాగుతోంది. ఎస్‌బీఐ, దేవాదాయ శాఖ అధ్వర్యంలో గురువారం నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ.19,08,367 ఆదాయం సమకూరింది. ఆంజనేయ స్వామి ఆలయ హుండీ నుంచి రూ1,54,299, కాళికాదేవి హుండీ నుంచి రూ. 12,56,723 ఆదాయం సమకూరింది. మొత్తంగా రూ. 33,19,389 ఆదాయం ఆలయ ఈవో కోమల్ తెలిపారు. అలాగే భక్తులు సమర్పించిన బర్రె దూడలు, ఆవులను వేలం వేయాల్సి ఉందన్నారు. ఇంకా ఆభరణాలు, తల నీలాలు, టెంకాయల టెండర్లకు సంబంధించిన లెక్కలు తేలాల్సి ఉందని చెప్పారు.

నిజ జీవితాలను ప్రతిబింబించే నాటకాలు

» ఎమ్మెల్సీ గోరటి వెంకన్న
» నాగర్‌కర్నూల్‌లో చింతామణి నాటక ప్రదర్శన



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నాటక ప్రదర్శనలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ గోరటి వెంకన్న

నాగర్‌కర్నూల్ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మంచి చెడులను తెలియజేసే నాటకాలు నిజ జీవితాలను ప్రతిబింబిస్తాయని ఎమ్మెల్సీ గోరటి వెంకన్న అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్‌లో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన చింతామణి నాటక ప్రదర్శనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నటుడు, కళాకారుడు, విశ్రాంత ఎంపీడీవో వి.నారాయణను ఘనంగా సన్మానించారు. అనంతరం కందనూలు కళాసేవా సమితి సభ్యులు చింతామణి నాటకాన్ని ప్రదర్శించారు. నాటక సమాజాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఆర్.సత్యం ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈ నాటకంలో బి.నరసింహారెడ్డి, జి.విష్ణుమూర్తి, చిలువేరి వెంకటయ్య, డి.రాములు, జి.మురళీధర్‌రావు, వనజా కుమారి, తిరుమల, ఝాన్సీ, రాంకిషన్‌రావు, కౌశిక్‌చారి ప్రధాన పాత్రలను పోషించారు.

క్రైం కార్నర్

పంక్చర్ దుకాణం దగ్ధం

▸ రూ. 80 వేల ఆస్తి నష్టం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నాగర్‌కర్నూల్ క్రైం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పంక్చర్ దుకాణం దగ్ధమైంది. ఫైర్ ఆఫీసర్ కృష్ణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీపురం రోడ్డులో మహమ్మద్ రఫీ పంక్చర్ దుకాణం నిర్వహిస్తున్నాడు. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో దుకాణం మూసివేసి వెళ్లాడు. రాత్రి 7 గంటల సమయంలో దుకాణంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు చెలరేగాయి. స్థానికులు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది వెంటనే అక్కడకు చేరుకొని మంటలను ఆర్పివేశారు. సంఘటనలో కంప్రెషర్‌తో పాటు, దుకాణంలోని సామగ్రి కాలిపోయిందని, దాదాపు రూ. 80 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని కృష్ణమూర్తి తెలిపారు.

వివాహిత అదృశ్యం

జడ్చర్ల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల పట్టణంలోని శ్రీరాంనగర్‌కాలనీకి చెందిన షాహీన్‌బేగం అనే వివాహిత అదృశ్యం అయినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పట్టణానికి చెందిన జహంగీర్ భార్య షాహీన్ బేగం రెండు నెలల క్రితం బంధువులతో కలిసి షాపింగ్ కోసం హైదరాబాద్‌కు వెళ్లింది. అక్కడ జహంగీర్ బావ రషీద్‌కు చెందిన ఫర్నిచర్ దుకాణానికి వెళ్లారు. ఆ సమయంలో అతడి తమ్ముడు రఫిక్‌తో ఆమెకు పరిచయం అయ్యింది. ఆ తర్వాత ఫర్నిచర్ విషయమై రెండు సార్లు అతడితో ఫోన్లో మాట్లాడింది. దీంతో షాహీన్‌బేగంపై అనుమానం వ్యక్తం చేస్తూ రఫిక్ భార్య, అతడి అన్న, రషీద్ భార్య ఫరీదా ఆమెను వేధించారు. ఈ నెల 16న రాత్రి 8 గంటల ప్రాంతంలో షాహీన్‌బేగం, భర్త జహంగీర్‌కు ఫోన్ చేసింది. మీ బావ, అక్కతో పాటు రఫిక్ భార్య, మిగతా వారు తనను వేధిస్తున్నారని ఏడుస్తూ చెప్పి, ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ కోసం పరిసర ప్రాంతంతో పాటు బంధువుల ఇళ్లలో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో జహంగీర్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

ఇసుక డంపు సీజ్

▸ తహసీల్దార్ కార్యాలయానికి తరలింపు



ఇసుక డంపును పరిశీలిస్తున్న ఆర్డీవో, తహసీల్దార్, డీఎస్పీ

ఉప్పునుంతల, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక డంపులను పోలీసులు సీజ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఉప్పునుంతల మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామానికి చెందిన జితేందర్ 32 ట్రాక్టర్ల ఇసుకను అక్రమంగా డంప్ చేశాడు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం అచ్చంపేట డీఎస్పీ పల్లె శ్రీనివాసులు, ఆర్డీవో మాధవి, తహసీల్దార్ ప్రమీల, ఎస్ఐ వెంకట్‌రెడ్డి తనిఖీలు నిర్వహించి, ఇసుక డంప్‌ను సీజ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశం మేరకు తహసీల్దార్ కార్యాలయానికి తరలించి ఆవరణలో నిల్వ చేశారు. ఈ ఇసుకను ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాల కోసం ఉపయోగించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

కుక్కలను చంపుతున్న చిరుతలు



గుట్ట రాళ్ళ మధ్యలో సంచరిస్తున్న చిరుత

నవాబ్‌పేట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, నవాబ్‌పేట మండలంలో కాపలాగా ఉండే కుక్కలను చిరుతలు చంపేస్తున్నాయి. ఎక్కడి నుంచో వచ్చిన చిరుతలు కొన్ని మండలంలోని యన్మన్‌గండ్ల సమీపంలోని దేవరగుట్ట గుహల్లో ఆవాసం ఏర్పాటు చేసుకున్నాయి. సమీపంలోని ఇటుకల బట్టీలు, పశువుల పాకలు, మామిడి తోటల వద్ద కాపలాగా ఉంటున్న కుక్కలను తిని ఆకలి తీర్చుకుంటున్నాయి. ఇప్పటికే 11 కుక్కలను చిరుతలు చంపి తిన్నట్లు స్థానికులు చెప్తున్నారు. పాకలలో కట్టేసి ఉన్న గొర్రెలు, మేకలు, ఆవులు, గేదెల జోలికి పోకుండా కుక్కలనే చంపుతున్నాయని అంటున్నారు. వాటి రుచి మరిగిన చిరుతలు ఊర్లోకి కూడా వస్తాయని స్థానికులు, చుట్టుపక్కల తండాల గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలో బుధవారం గుట్టపై తిరుగుతున్న చిరుతలను స్థానికులు గమనించారు. సంబంధిత అధికారులు చిరుతలను బంధించి, అడవిలో వదిలిపెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నడిగడ్డలో.. నకిలీ దందా

▸ వానా కాలానికి ముందే నకిలీ విత్తనాల కలకలం

▸ మల్దకల్ మండలంలో పోలీసుల దాడులు

▸ 51 బస్తాల లూజు విత్తనాలు స్వాధీనం

▸ సీడ్ ఆర్గనైజర్లే అసలు సూత్రధారులు

అయిజ టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : నడిగడ్డలో నకిలీ విత్తనాల కలకలం మరో సారి చర్చనీయాంశం అయ్యింది. జోగుళాంబ గద్వాల జిల్లా, మల్దకల్ మండలంలోని, కుర్తిరావులచెర్వు గ్రామంలో బుధవారం 51 బస్తాల లూజు పత్తివిత్తనాలు పట్టుబడటం రైతులను ఆందోళనకు గురి చేసింది. వానా కాలం రాకముందే అక్రమ వ్యాపారం మొదలైనట్లు వెల్లడైంది. జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో రైతులు 45 నుంచి 50 వేల ఎకరాల్లో సీడ్ పత్తి సాగు చేస్తారు. సీడ్ ఆర్గనైజర్లు వారికి విత్తనాలు, డబ్బు అందించి సాగు చేయించటం ఇక్కడ ఏటా కొనసాగుతున్న వ్యవహారం. ఈ క్రమంలో పలువురు ఆర్గనైజర్లు రైతుల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకుని గ్రామాల్లో వారు నియమించుకున్న సబ్ ఆర్గనైజర్లతో విత్తనాలు ఫెయిల్ అయ్యాయని చెప్పిస్తారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో లక్షల రూపాయలు అప్పు తీసుకుని పంట సాగు చేసిన రైతులు ఆందోళనకు గురై, సమస్య పరిష్కారం కోసం మళ్లీ ఆర్గనైజర్ల వద్దకే వెళ్తున్నారు. ఫలానా కంపెనీతో మేము మాట్లాడి పెట్టుబడిలో కొంతైనా వచ్చేటట్లు చేస్తామని వారు రైతులను నమ్మిస్తుండటంతో, పండించిన విత్తనాలను వారికి ఇచ్చేస్తున్నారు. ఇలా రైతుల నుంచి తీసుకున్న విత్తనాలను గ్రామాల్లో ఉన్న సబ్ ఆర్గనైజర్ల ద్వారా ఎక్కువ ధరలకు మళ్లీ రైతులకే అక్రమ మార్గంలో విక్రయించి కోట్ల రూపాయలు సంపాదించుకుంటున్నారన్న విమర్శలున్నాయి. నిజంగా ఫెయిల్ అయిన విత్తనాలను కూడా కంపెనీలు క్రషింగ్ చేయకుండా మేనేజ్ చేసుకుని, అక్రమంగా విక్రయిస్తారనే వాదనలు బలంగా ఉన్నాయి. వివిధ రాష్ట్రాల్లో ఫెయిల్ అయిన విత్తనాలను అక్రమ మార్గంలో తీసుకొచ్చి రైతులకు అంటగడుతున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఇలా నకిలీ విత్తన విక్రయాలకు ఆర్గనైజర్లే సూత్రధారులని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది.



ఉండవెల్లి మండలంలో పట్టుబడ్డ నకిలీ విత్తనాలతో పోలీసులు (ఫైల్)

పలుమార్లు పట్టుపడిన నకిలీ విత్తనాలు

- 2022 మే నెలలో ఉండవెల్లి మండలంలో రూ. 30 లక్షల విలువైన 16.75 క్వింటాళ్లు, అయిజ పట్టణంలోని రాయచూరు చౌరస్తాలో 40 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి.
- 2024, ఏప్రిల్‌లో నారాయణపేట మండలంలోని సింగారంలో 16 సంచుల్లో నిల్వ ఉంచిన రూ. 8.85 లక్షల విలువైన 8.85 క్వింటాళ్ల నకిలీ విత్తనాలు దొరికాయి. మే నెలలో మక్తల్ పరిధిలోని భూత్పూర్ గ్రామంలో 57.66 కిలోల నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.
- 2024 మేలో మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని గోప్లాపూర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన (బీటీ-3) 3.20 క్వింటాళ్ల నిషేధిత పత్తి విత్తనాలను పోలీసులు పట్టుకున్నారు. అదే రోజు ఊట్కూరు మండల పరిధిలోని నిడుగుర్తి గ్రామంలో 23.7 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు గుర్తించారు.
- 2024 మేలో, కొడంగల్ మండలం, హస్నాబాద్ గ్రామంలో రూ, 16.77 లక్షల విలువ చేసే 9.72 క్వింటాళ్లు, ఉండవెల్లి మండలం, పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద రూ, 9 లక్షల విలువచేసే 18 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు సీజ్ చేశారు.
- 2024 మే నెలలో నవాబ్‌పేట మండలంలోని ఓ ట్రేడర్స్‌లో అనుమతి లేకుండా విక్రయించేందుకు నిల్వ చేసిన 58 పాకెట్లు కంది, 360 పాకెట్లు మొక్కజొన్న విత్తనాలను టాస్క్‌ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.
- 2024 జనవరిలో రెండు ప్రముఖ కంపెనీ బ్రాండ్ల పేర్లతో నకిలీ వ్యవసాయ మందులను తయారు చేసి విక్రయించిన వ్యవహారంలో అయిజ, ఇటిక్యాల పోలీస్‌స్టేషన్‌లలో 13 మందిపై కేసులు నమోదయ్యాయి.



అయిజలో పట్టుబడ్డ పత్తి విత్తనాలతో పోలీసులు, వ్యవసాయాధికారులు (ఫైల్)

పట్టించుకోని ప్రభుత్వాలు !

రైతులను నకిలీ విత్తనాల నుంచి కాపాడేందుకు విత్తన ధ్రువీకరణకు ప్రత్యేక వ్యవస్థ అవసరమని కేంద్ర విత్తన నాణ్యత ధ్రువీకరణ బోర్డు (సీఎస్‌సీబీ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచనలు చేసినా, పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. విత్తన నాణ్యతను పరీక్షించేందుకు గ్రామపంచాయితీ, నియోజకవర్గ స్థాయిల్లో ప్రయోగశాలలు ఉండాలని బోర్డు సూచిస్తోంది. ప్రయోగశాల ఇచ్చిన నాణ్యత ధ్రువీకరణ పత్రం పొందిన దుకాణాల్లోనే రైతులు అన్ని రకాల విత్తనాలు కొనేందుకు ఏర్పాట్లు చేయాలని పేర్కొంటున్నది. ప్రస్తుతం విత్తన నాణ్యతను పరీక్షించేందుకు ప్రయోగశాలతో పాటూ, విత్తన డీఎన్ఏను గుర్తించేందుకు మరో కేంద్రం హైదరాబాదులో మాత్రమే ఉన్నాయి.

నకిలీ విత్తనాలతో తీవ్ర నష్టం



నకిలీ విత్తనాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే వ్యవసాయం చాలా ఇబ్బందిగా మారింది. ఏడాదికేడాది ఆగు పెట్టుబడులు పెరుగుతున్నాయి కానీ ఆశించిన మేర దిగుబడులు మాత్రం రావడం లేదు. గిట్టుబాటు ధరలు మాత్రం మరీ ఘోరంగా పడిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో నకిలీ విత్తనాలు అంటగడితే రైతు ఏమైపోవాలి. ఇలాంటి అక్రమ వ్యవహారాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

\- దేవేందర్, రైతు, సింధనూరు, అయిజ మండలం :

జీవితాంతం జైల్లో పెట్టాలి



అందరి కడుపు నింపే అన్నదాతకు నకిలీ విత్తనాలు అంటగట్టే వారిని జీవితాంతం జైల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలి. మా లాగా పెద్దగా చదువుకోని తాము నమ్మకంతో వ్యాపారుల వద్ద వివిధ రకాల విత్తనాలు తెచ్చుకుంటాం. అక్రమ సంపాదనకు కక్కుర్తిపడి రైతుల జీవితాలతో ఆడుకోవటం మంచిది కాదు. నడిగడ్డలో నకిలీ విత్తనాల వ్యవహారం పెద్ద ఎత్తున నడుస్తున్నట్లుగా తెలుస్తుంది. అధికారులు, నాయకులు గట్టి చర్యలు తీసుకొని అరికట్టేందుకు కృషి చేయాలి.

\- కోటేశ్వర్ రెడ్డి, రైతు, బొంకూరు, ఉండవెల్లి

పటిష్ట నిఘా ఉంచాం



జిల్లాలో ఎక్కడా నకిలీ విత్తనాలు విక్రయించకుండా పటిష్ట నిఘా ఉంచాం. ప్రైవేటు వ్యాపారాలు చేసే విత్తన, మందుల దుకాణాలను స్థానిక పోలీసుల సహకారంతో తనఖీలు చేయాలని అన్ని మండలాల వ్యవసాయాధికారులకు ఆదేశాలు జారీ చేశాం. ఏ మాత్రం తేడా వచ్చినా కేసులు నమోదు చేయాలని సూచించాం. రైతులు కూడా జాగ్రత్తగా ఉండాలి. విత్తనాలు కొన్నప్పుడు దుకాణం పేరుతో, కచ్చితమైన ధరలను తెలిపే రసీదును తప్పనిసరిగా తీసుకొని, భద్రపరుచుకోవాలి.

\- సక్రియానాయక్, జిల్లా వ్యవసాయాధికారి, గద్వాల

ప్రమాదకర ప్రాంతంలో శిథిలాల తొలగింపు

▸ కార్మికుల ఆచూకీ కోసం సాగుతున్న అన్వేషణ

▸ ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి

▸ డీ-2 ప్రాంతంలో కొనసాగుతున్న సహాయక చర్యలు



అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ప్రతేకాధికారి శివశంకర్ లోతేటి

దోమలపెంట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదకరంగా ఉన్న డీ-2 సమీపంలో రెస్క్యూ బృందాలు తవ్వకాలు జరుపుతున్నాయని ప్రత్యేకాధికారి శివశంకర్ లోతేటి అన్నారు. శిథిలాల కింద చిక్కుకున్న ఆరు గురు కార్మికుల ఆచూకీ కోసం సొరంగంలో 55 రోజులుగా తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. దోమలపెంట సమీపంలోని ఎస్ఎల్‌బీసీ సొరంగం ముఖద్వారం వద్ద వివిధ శాఖలకు చెందిన రెస్క్యూ బృందాల అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ఎడమ గట్టు సొరంగం ప్రమాద ఘటనలో ఇప్పటికే ఇద్దరు కార్మికుల మృతదేహాలను బయటకు తీసినట్లు తెలిపారు. మిగతా ఆరుగురి ఆచూకీని కనుక్కునేందుకు డీ1, డీ2 ప్రాంతాల్లో తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం డీ2 ప్రాంతంలో బురద, మట్టి తొలగింపు, టీబీఎం విడి భాగాలను కత్తిరింపు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. శిథిలాల కింద చిక్కుకున్న వారి ఆచూకీ తెలుసుకునేందుకు రెస్క్యూ బృందాలు తీవ్రంగా శ్రమిస్తున్నాయన్నారు. శిథిలాల తొలగింపు పనుల్లో 5 ఎక్స్‌కవేటర్లు నిరంతరం పని చేస్తున్నాయని తెలిపారు. శిథిలాలను పెకిలించి, కన్వేయర్ బెల్టు, లోకో ట్రైన్ ద్వారా బయటకు తరలించడంతో పాటు, నీ టి ఊటను ఎప్పటికప్పుడు బయటకు పంపింగ్ చేస్తున్నట్లు వివరించారు. నిషిద్ధ ప్రాంతంగా గుర్తించిన ప్రాంతంలో ఇనుప కంచె ఏర్పాటు చేసి, ఎవరూ వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రమాద ప్రాంతాన్ని ఎప్పటికప్పుడు ప్రత్యేక పరికరాలతో పర్యవేక్షణ, పరిశీలన చేస్తున్నామని చెప్పారు. రోజు రోజుకు సొరంగంలో సహాయక చర్యలను వేగవంతం చేస్తున్నామని, ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా శిథిలాల తొలగింపు పనులను పూర్తి చేసేందుకు రెస్క్యూ బృందాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. సహాయక చర్యల్లో సింగరేణి రెస్క్యూ టీం మేనేజర్లు రాజేందర్ రెడ్డి, మాధవరావు, ఎన్‌డీఆర్ఎఫ్, హైడ్రా, రైల్వే, జీఎస్ఐ, ఇరిగేషన్, జేపీ కంపెనీ, ర్యాట్ హోల్ మైనర్లతో పాటు, వివిధ శాఖ అధికారులు పాల్గొంటున్నారు.



డీ 1 ప్రాంతంలో బురద, మట్టిని ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తున్న దృశ్యం

వేర్వేరు కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష

▸ హత్య కేసులో దోషికి పదేళ్లు..

మక్తల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : వేర్వేరు కేసుల్లో ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారులు తీర్పు వెల్లడించారు. నారాయణపేట జిల్లా, మక్తల్ మండలం, పస్పుల గ్రామంలో జరిగిన హత్య కేసులో దోషికి పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు సీఐ రాంలాల్, ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. నారాయణపేట జిల్లా, మక్తల్ మండలం, పస్పుల గ్రామానికి చెందిన లక్ష్మప్ప తన కుమార్తె రేణుకకు, జడ్చర్ల మండలం ఆలూరు గ్రామానికి చెందిన గోపిమల్లేశ్‌తో వివాహం చేసి ఇల్లరికం తెచ్చుకున్నారు. అతడు పొలం పనులు సక్రమంగా చేయకపోవడంతో అప్పుడప్పుడు మందలించేవాడు. ఈ క్రమంలో ఆవులకు గడ్డి వేయాలని మామ లక్ష్మప్ప చెప్పడంతో గోపిమల్లేశ్ అతడిని కర్రతో బలంగా కొట్టడంతో మృతి చెందాడు. ఈ విషయంపై లక్ష్మప్ప బావమరిది నర్సింహులు 2023, జూలై 15న మక్తల్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. అతడిపై నేరం రుజువు కావడంతో గోపిమల్లేశ్‌కు రూ. 10 వేల జరిమానా, పదేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి అబ్దుల్ రఫీ తీర్పు వెల్లడించినట్లు సీఐ రాంలాల్ తెలిపారు.

దొంగతనం కేసులో మూడేళ్లు..

ఖిల్లాఘణపురం (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండల కేంద్రంలో బంగారం వర్క్‌షాప్‌లో చోరీకి పాల్పడిన వ్యక్తికి న్యాయాధికారి మూడు సంవత్సరాల జైలు శిక్ష విధించారు. ఎస్ఐ సురేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన పంతగాని మన్యంకొండ అనే వ్యక్తి, బజారు ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలోని బంగారం వర్క్‌షాప్‌లో గత ఏడాది, డిసెంబర్ 24న అర్ధరాత్రి సమయంలో ప్రవేశించాడు. 14 గ్రాముల బంగారం, 615 గ్రాముల వెండి వస్తువులను ఎత్తుకెళ్లాడు. సంఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడినది పంతగాని మన్యంకొండ అని గుర్తించారు. గత ఏడాది డిసెంబర్ 29న అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో మూడు సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 500 జరిమానా విధిస్తూ గురువారం జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు రెండో అదనపు న్యాయాధికారి తీర్పు వెల్లడించారు. విచారణ వేగవంతంగా పూర్తి చేసి, చోరీ కేసును ఛేదించేందుకు కృషి చేసిన ఎస్ఐ సురేశ్‌గౌడ్, రాష్ట్ర అభియోగ అధికారి రాజేశ్, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాసులును పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో రెండు రోజులు..

వీపనగండ్ల (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు వీపనగండ్ల ఎస్ఐ రాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండల పరిధిలోని సంగినేనిపల్లి గ్రామానికి చెందిన చిన్ని కృష్ణ ఇటీవల మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. అతడిని గురువారం కోర్టులో హాజరు పరచగా, రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు వెల్లడించినట్లల ఎస్ఐ పేర్కొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి తీవ్ర గాయాలు

▸ రెండు బైకులు ఢీకొని ఇద్దరు

▸ గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు

▸ ద్విచక్ర వాహనం ఢీకొని మరొకరు



ధరూరు వద్ద జరిగిన ప్రమాదంలో దెబ్బతిన్న ద్విచక్ర వాహనాలు

ధరూరు/ దేవరకద్ర/ వనపర్తి రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. జోగుళాంబ గద్వాల జిల్లా, ధరూరు మండల కేంద్రంలో గురువారం ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కేటీదొడ్డి మండలానికి చెందిన రేవన్న అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై గద్వాలకు వెళ్తున్నాడు. అదే సమయంలో ధరూరు మండలం మాల్ దొడ్డి గ్రామానికి చెందిన రాము ద్విచక్రవాహనంపై వస్తున్నాడు. మండల కేంద్రంలో రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తూ ఢీకొన్నాయి. ప్రమాదంలో రేవన్నకు కాలు విరిగింది. రాముకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులతో పాటు అంబులెన్స్‌కు స్థానికులు సమాచారం అందించారు. క్షతగాత్రులను అంబులెన్స్‌లో గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. ధరూరు ఎస్ఐ కొండా శ్రీహరి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, దేవరకద్ర మండల కేంద్రంలోని అమ్మాపూర్ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న గుర్తు తెలియని వ్యక్తి (40)ని, గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. దీంతో అతడి తలకు, చేతికి బలమైన గాయాలై కిందపడిపోయాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అతడు సరిగా మాట్లాడలేకపోతున్నాడని, తన పేరు శ్రీను అని మాత్రమే చెప్పాడని ఎస్ఐ నాగన్న తెలిపారు. ఎవరైనా తెలిసిన వారు ఉంటే తమకు సమాచారం అందించాలని కోరారు.



ప్రమాదంలో గాయపడిన బాలయ్య

● వనపర్తి జిల్లా, వనపర్తి మండల పరిధిలోని అంజనగిరి శివారులోని గండిలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్ర గాయా లయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మండల పరిధిలో ని చందాపూర్ గ్రామానికి చెందిన బాలయ్య, పాన్‌గల్ మండలం కొత్తపేట గ్రామంలో డెయిరీ ఫామ్ లీజుకు తీసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. గురువారం పాల టిన్నుల ను వాహనానికి తగిలించుకుని వనపర్తికి బయలుదేరాడు. అంజనగిరి శివారులోని గండిలోకి రాగానే కుక్క అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యా యి. స్థానికులు అతడిని అంబులెన్సులో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

న్యూస్ బాక్స్

స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలి

వీపనగండ్ల, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి) : స్త్రీలు అన్ని రంగాల్లో రాణించి సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలని ఎస్ఐ రాణి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో 'ఆదర్శ మహిళలు వారి ఎదుగుదల' అనే అంశంపై అవగాహన కల్పించారు. సాయిలత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో సీఐటీయూ ట్రేడ్ యూనియన్ శిక్షణ తరగతులు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు అధ్యక్షతన నిర్వహించారు. మే 20న నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

బాలుడి అదృశ్యం : కేసు నమోదు

శ్రీరంగాపూర్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన బాలు నెల రోజుల కిందట చెప్పకుండా ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. దీంతో తండ్రి బాలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

తడి పొడి చెత్తపై అవగాహన

వనపర్తి టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : తడి పొడి చెత్తపై మునిసిపల్ అధికారులు గురువారం పట్టణంలోని 25వ వార్డులో కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్‌రెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మూగజీవాల ఆరోగ్య సంరక్షణ కోసం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ సుసాన్ కేసి తెలిపారు. ఈ నెల 16 నుంచి వచ్చే నెల 14 వరకు పశువుల వద్దకు వెళ్లి టీకాలు వేస్తామని వివరించారు.

సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యం

వనపర్తి విద్యా విభాగం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు పీఆర్‌టీయూ టీఎస్ ఎల్లప్పుడు అండగా ఉంటుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు. పీఆర్‌టీయూ టీఎస్ సంఘ వనపర్తి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కొంకల శివకుమార్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగుల వితరణ

కొత్తకోట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మిరాసిపల్లి స్టేజి, మిరాసిపల్లి, పామాపురం గ్రామాల ప్రాథమిక పాఠశాలకు చెందిన 300 మంది విద్యార్థులకు రాష్ట్ర గ్రామీణ సంక్షేమ మిషన్ సంస్థ ద్వారా రామకృష్ణాపూర్ గ్రామానికి చెందిన గుంటి నగేష్ సాగర్ గురువారం బ్యాగులను అందజేశారు. శ్రీనివాస్‌రెడ్డి, సాయిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్, నరసింహ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు..

కొత్తకోట : పట్టణంలో 19 మంది లబ్ధిదారులకు అయిదు లక్షల డెబ్బై మూడు వేల రూపాయల విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ ఇళ్లకు వెళ్లి గురువారం అందజేశారు. బోయొజ్, శ్రీనివాసులు, సలీంఖాన్, ఏజాజ్, బాలరాజు యాదవ్ పాల్గొన్నారు.


25న తైబజార్ వేలం

అమరచింత, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 25న అమరచింత మునిసిపల్ కార్యాలయంలో వేలం పాట నిర్వహిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ రవిబాబు గురువారం పేర్కొన్నారు. మరింత సమాచారం కోసం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కళలతో మానసిక ఆనందం

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కళలు మనిషికి మానసిక ఆనందాన్ని కలిగిస్తాయని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్ అన్నారు. గురువారం విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్ బసవలింగయ్య వనపర్తిలో ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన హ్యాండీ క్రాఫ్ట్ వేసవి శిక్షణ శిబిరం ప్రారంభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై కరపత్రం విడుదల చేశారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆత్మకూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా ఆత్మకూరు ఆయా షాపింగ్ మాల్స్ వద్ద అగ్ని ప్రమాదాలపై ఆత్మకూరు ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు పట్టణ ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎల్‌పీజీ గోడౌన్లలో వెంటిలేషన్ సరిగా ఉండే విధంగా చూసుకోవాలని సిలిండర్ డంపు చేసే క్రమంలో గ్యాప్ మెంటైన్ చేయాలని సూచించారు.

సమస్యలకు నిలయం బొల్లారం పాఠశాల

» ప్రహరీ లేక మందుబాబుల ఆగడాలు » శిథిలావస్థలో వంట గది

వీపనగండ్ల, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బొల్లారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమస్యలు నెలకొన్నాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వంట ఏజెన్సీ మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. పాఠశాల చుట్టూ కాంపౌండ్ వాల్ లేకపోవడంతో మందుబాబుల ఆగడాలు మితిమీరి పోతున్నాయి. పాఠశాలలో 65 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఏడుగురు ఉపాధ్యాయులకు గాను అయిదుగురు మాత్రమే ఉన్నారు. రెండు బయాలజికల్ సైన్స్ జీహెచ్ఎం పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానమైన సబ్జెక్టు బయలాజికల్ సైన్స్ బోధించేందుకు ఉపాధ్యాయులు లేరు. దీంతో ఆ సబ్జెక్టుల విద్యార్థులు ప్రావీణ్యం సాధించలేక వెనుకబడి పోతున్నారు. ఆటలు ఆడించే వ్యాయామ ఉపాధ్యాయ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో విద్యార్థులు క్రీడలపై దృష్టి సారించలేకపోతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. వంట గది పైకప్పు రేకులు గాలులకు ఎగిరిపోయాయి. సంవత్సరం పైబడి మరమ్మతులు చేయకపోవడంతో వంట ఏజెన్సీ మహిళలు ఇబ్బదులు ఎదుర్కొంటున్నారు. పాత తరగతి గదిలో వంట చేస్తున్నారు. గ్రామానికి దూరంగా ఉన్న పాఠశాల భవనానికి ప్రహరీ లేదు. మందుబాబులు పాఠశాల ఆవరణలోనే మద్యం తాగడం, మద్యం సీసాలు పగలగొట్టడం వంటి ఆగడాలకు పాల్పడుతున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. యువకులు కొందరు పుట్టిన రోజు వేడుకలు కూడా అక్కడే నిర్వహించుకుంటున్నారు. పాఠశాల గదుల తలుపులు విరగొట్టడం వంటి పనులకు పాల్పడుతున్నారని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, పోలీసులు గస్తీలు నిర్వహించి మందుబాబుల ఆగడాలను అరికట్టాలని కోరుతున్నారు. పాఠశాలలో కంప్యూటర్లు ఉన్న నేర్పించే బోధకులు లేకపోవడంతో ఉపాధ్యాయులే కొంత మేర కంప్యూటర్ విద్యను అందిస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు నియమించాలని, పీఈటీ పోస్టులు మంజూరు చేయాలని, కాంపౌండ్ వాల్ నిర్మించాలని, వంట గది మరమ్మతుతో పాటు భోజనం చేసేందుకు ప్రత్యేకమైన వాల్ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.



ప్రహరీ లేని బొల్లారం పాఠశాల



పైకప్పు లేని వంట గది

డీజేల సంప్రదాయానికి స్వస్తి పలకాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు ఊరేగింపులో డీజేల సాంప్రదాయానికి స్వస్తి పలకాలని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని డీజేల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడారు. ముఖ్యంగా యువత ఈ సాంప్రదాయం రావడంతో ఊరేగింపులు పెళ్లిళ్లలో విచ్చలవిడిగా మద్యం తాగి గొడవలకు పాల్పడుతున్నారని అన్నారు. ప్రధానంగా డీజేల నుంచి అధిక డెసిబల్స్ శబ్ధం రావడంతో యువత గుండెపోటు వచ్చి పదుల సంఖ్యలో మృతి చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి నుంచి జిల్లా పరిధిలో డీజేలతో పాటు బాణసంచా నిషేధిస్తున్నట్లు తెలిపారు. ఎవరైనా ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే.. వారిపై బీఎన్ఎస్ 223, 280, 292, 293, 324 బీఎన్ఎస్ 152 పర్యావరణ పరిరక్షణ చట్టం ప్రకారం 15 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రూ.లక్ష జరిమానా, ఐదేళ్ల జైలు శిక్ష ఉంటుందని వివరించారు. అదనపు ఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు, డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐలు కృష్ణ, రాంబాబు, శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్ పాల్గొన్నారు.

పోలీసుల అప్రమత్తతే శ్రీరామ రక్ష

కొత్తకోట : పోలీసుల అప్రమత్తతనే ప్రజలకు శ్రీరామ రక్ష అని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. గురువారం రాత్రి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, ఫిర్యాదుల నిర్వహణను పరిశీలించి రిజిస్టర్‌లో నమోదైన కేసులను తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ సిబ్బందితో మాట్లాడారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన బాధితుడితో మర్యాదగా మాట్లాడి బాధను తెలుసుకొని ఫిర్యాదు తీసుకొని నమ్మకం కలిగించాలన్నారు.

పోలీసులకు సన్మానం

కొత్తకోట, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామకృష్ణాపూర్‌కి చెందిన మొగులన్న కుమారులు జయసింహ, విక్రమ్‌సింహ పోలీస్ కానిస్టేబుల్ శిక్షణ పూర్తి చేసుకున్నారు. విధులకు హాజరవుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని నాయకులు, యువకులు సోదరులిద్దరితో పాటు తల్లిదండ్రులను సన్మానించారు. చంద్రశేఖర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, విక్రం సింహ రెడ్డి, భరత్ యాదవ్, తదితరులు ఉన్నారు.

నూజివీడు సీడ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

మదనాపురం, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి) : రైతులకు నకిలీ వరి విత్తనాలు విక్రయించిన నూజివీడు సీడ్స్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని గోపన్‌పేటలో నకిలీ విత్తనాలతో నష్టపోయిన రైతులతో మాట్లాడి విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేయాలి

పెబ్బేరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషిచేయాలని నూతనంగా ఎన్నికైనా అధ్యక్షుడు మహేష్ కుమార్ ఎమ్మెల్యే మేఘారెడ్డిని గురువారం జిల్లా క్యాంపు కార్యాలయంలో కలిసి కోరారు. ఈ సందర్భంగా మట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ సినియర్ నాయకులు రంగాపురం రాంచంద్రారెడ్డి, యుగేందర్‌రెడ్డి, బుచ్చయ్య శెట్టి, రమేష్‌శెట్టి, శంకర్‌శెట్టి, విజయ్‌కుమార్ శెట్టి తదితరులు పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పాన్‌గల్, ఏప్రీల్ 17 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యాసంత్సరానికి సంబంధించి బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈవో శ్రీనివాస్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

వీపనగండ్ల, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని నోడల్ ఆఫీసర్ డాక్టర్ వంశీ కృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మిషన్ మధుమేహ, టీబీ వంద రోజుల కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు మన పీహెచ్‌సీకి కలెక్టర్ ప్రశంసా పత్రం అందించినట్లు తెలిపారు. ఆయుష్ డాక్టర్లు హేమవర్ధన్, శ్వేత, దర్శశ్రీ, భాగ్యశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలి

ఆత్మకూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు, హమాలీలకు టెంట్లు తాగునీటి వంటి సౌకర్యాలు కల్పించాలని ఏఐటీయూసీ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి మోష పేర్కొన్నారు. మండల పరిధిలోని మూలమల్లలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్దకు శుక్రవారం ఆయన చేరుకుని మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులు టెంట్లు తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ అధికారులు నిబంధనలు జారీ చేసినా.. నిర్వాహకులు నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆరోపించారు.

'కాంగ్రెస్‌ను నమ్ముకుంటే దివాలా తీయాల్సిందే'

వనపర్తి రూరల్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీని నమ్ముకుంటే మనం దివాల తీస్తామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్ అన్నారు. గురువారం వనపర్తి మండలం చందాపూర్‌లో బీఆర్ఎస్ రజతోత్సవ సభ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. 27న వరంగల్‌లో జరగబోయే రజతోత్సవ సన్నాహక సమావేశానికి హాజరుకావాలని కోరారు. మాణిక్యం, నరసింహ పాల్గొన్నారు.



చందాపూర్‌లో రజతోత్సవ వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్

ధాన్యం కొనుగోలుకు 481 కేంద్రాలు

వనపర్తి రాజీవ్ చౌరస్తా, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కోసం 481 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటికే 379 కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ డీఎస్ చౌహాన్ యాసంగి వరి ధాన్యం కొనుగోలు, సీఎంఆర్ అప్పగింతపై గురువారం అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) సివిల్ సప్లయ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. సివిల్ సప్లయ్ అధికారి విశ్వనాథ్, ఉమాదేవి, రాణి, సివిల్ సప్లయ్ డీఎం జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్

విగ్రహావిష్కరణను విజయవంతం చేయాలి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఈ నెల 23న చేపట్టనున్నామని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు మాదిగ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ కమిటీ, ఆత్మకూర్ మండల కమిటీ సభ్యులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆత్మకూర్ మునిసిపాలిటీ కేంద్రంలో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ ఉంటుందని తెలియజేశారు. గంధం గట్టయ్య మాదిగ, కృష్ణ, మంద నరసింహ, లక్ష్మణ్, స్వామి, కేశవులు, సోంబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న నాయకులు

'నరేంద్రమోదీవి కక్ష సాధింపు చర్యలు'



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

పెబ్బేరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్య పద్ధతిల్లో ఎదుర్కోలేక ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఏఐసీసీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, ఎంపీ రాహుల్‌గాంధీలపై రాజకీయ కక్షసాధింపు చర్యలను ఖండిస్తు గురువారం పెబ్బేరు పట్టణ కేంద్రంలో రహదారిపై ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోలేక బీజేపీ ప్రభుత్వం దుర్మార్గమైన చర్యలకు పాల్పగుతున్నట్లు ఆరోపించారు. విజయవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడు, వెంకట్రాములుయాదవ్ పాల్గొన్నారు.

రేవల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రతీ నాయకుడిని కేసుల పేరుతో బెదిరించాలనుకుంటే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని కాంగ్రెస్ పార్టీ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నేషనల్ హెరాల్డ్ పత్రికా అంశంలో కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పేర్లను కక్ష పూరితంగా చార్జిషీట్‌లో నమోదు చేయడానికి నిరిసిస్తూ ఉమ్మడి గోపాల్‌పేట మండల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సత్యాశీలా రెడ్డి ఆధ్వర్యంలో గోపాల్‌పేట మండల కేంద్రంలో ధర్నా నిర్వహించి, ప్రధాని నరేంద్ర మోదీ, మంత్రి అమిత్‌షాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

30 లోపు ఎల్ఆర్ఎస్ కట్టుకునేలా కృషి చేయాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : ఏప్రిల్ 30న ఎల్ఆర్ఎస్ గడువు ముగుస్తున్నందున కచ్చా లే అవుట్, ప్లాట్లు రెగ్యులరైజ్ చేయించుకునే విధంగా మునిసిపల్ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదర్శ సురభి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి మునిసిపల్ అడ్మినిస్ట్రేటివ్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఎల్ఆర్ఎస్ పురోగతిపై కలెక్టర్లతో వెబ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. అదనపు కలెక్టర్ యాదయ్య పాల్గొన్నారు.

కొత్తగా తెచ్చిన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలి

వనపర్తి టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని అవాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండీ జబ్బార్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్లో అవాజ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మునీరొద్దీన్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వక్ఫ్ బోర్డు నూతన చట్టాన్ని రద్దు చేసే వరకు రాజ్యాంగ బద్ధంగా పోరాటాలు కొనసాగిస్తామన్నారు. జనజ్వాల, నాగరాజు, గంధం భగత్, పరమేశ్వరాచారి, ఆర్ఎన్ రమేష్, సత్తార్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎండీ జబ్బార్

త్వరలోనే ప్రతీ ఒక్కరికి భూధార్ కార్డు



భూభారతి చట్టం గురించి రైతులకు వివరిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెద్దమందడి, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఒక్కరికి ఆధార్ కార్డు లాగానే భూ భారతి 2025 చట్టం ద్వారా రాష్ట్రంలోని ప్రతీ భూ కమతానికి భూధార్ కార్డు పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో భూ భారతి భూమి హక్కుల రికార్డు- 2025 చట్టం గురించి అందులోని ముఖ్యాంశాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం పాల్గొనగా.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్రంలోని రైతులు, మేధావులు, నాయకులు సహా అందరి సలహాలు, సూచనలతోనే ప్రభుత్వ భూ భారతి చట్టం 2025ను రూపొందించి అమలులోకి తీసుకొచ్చిందని అన్నారు. గతంలో అమలులో ఉన్న ధరణి కారణంగా రైతులకు అనేక సమస్యలు ఎదురయ్యాయని ఇప్పుడు ప్రజా ప్రభుత్వం తెచ్చిన భూభారతి చట్టంతో అన్ని వివాదాలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. సీఎం ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం భూభారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చారన్నారు. చట్టంలోని నియమాలను అమలు చేయడంలో రెవెన్యూ అధికారులది కీలక పాత్ర అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కడుపు నింపడానికి రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం అందిస్తుందన్నారు. కలెక్టర్, డీసీసీబీ చైర్మన్‌తో కలిసి ప్రభుత్వం పంపిణీ చేసిన సన్న బియ్యంతో లబ్ధిదారుల ఇంట్లో భోజనం చేశారు. వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూభారతితో ప్రతీ ఒక్కరికి లబ్ధి

ఖిల్లాఘణపురం : మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం భూభారతి భూమి హక్కుల రికార్డు 2025 పై రైతులకు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆధ్వర్యంలో అధికారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధరణిలోని సమస్యలకు పరిష్కారం చూపుతూ భూభారతి చట్టాన్ని అమలులోకి తెచ్చిందని చెప్పారు.

రైతులకు కష్టాలు రానివ్వం : చిన్నారెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చిన్నారెడ్డి

రేవల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని, ఈ ప్రభుత్వంలో రైతులకు ఎలాంటి ఆపద రానివ్వమని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. గురువారం గోపాల్‌పేట మండలంలోని జయన్న తిరుమలాపురంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రైతులకు ఏడాది కాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. వాతావరణ సూచన మేరకు ధాన్యం రాసుల వద్ద టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని రైతులకు సూచించారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని ప్రతీ గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని సూచించారు. ప్రవీణ్‌రెడ్డి, బొజ్జన్న, మన్నెమ్మ, లోకేశ్వర్‌రెడ్డి, బాలేశ్వర్, పర్వతాలు పాల్గొన్నారు.

కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

రేవల్లి : మండల కేంద్రంలో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రారంభించారు. రఘు, పర్వతాలు, లక్ష్మీదేవి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ చేయడమే లక్ష్యం

పెద్దమందడి, ఏప్రిల్ 17, (ఆంధ్రజ్యోతి) : పేదలకు నాణ్యతతో కూడిన సన్న బియ్యం పంపిణీ చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అన్నారు. పెద్దమందడి మండలం జంగమయ్యపల్లిలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్త బాలచందర్ స్వగృహంలో పేదలకు అందజేస్తున్న సన్న బియ్యంతో వండిన ఆహారాన్ని సహపంక్తి భోజనం చేశారు. పెంటన్నయాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, మొగిలి సత్యారెడ్డి, మన్యం పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయాలి

ఖిల్లాఘణపురం, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక వేగవంతం చేయాలని గురువారం మండల పంచాయతీ అధికారి రాజు పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. నిరుపేద కుటుంబాలకు చెందిన ఇల్లు కట్టుకోవడానికి సొంతంగా ఖాళీ స్థలం ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులుగా ప్రాధాన్యత కల్పించాలని అన్నారు. ఈ నెల 21 లోగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ సుగుణ, సుధీర్ రెడ్డి, క్యామ రాజు, ప్రకాష్, దామోదర్ రెడ్డి, నరసింహ గౌడ్ పాల్గొన్నారు.

పాన్‌గల్/ అమరచింత/ ఆత్మకూరు : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అర్హులైన వారిని ఎంపిక చేయాలని ఆత్మకూరు ఎంపీడీవో శ్రీపాద పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాల్‌లో మండలంలోని ఆయా గ్రామాల ఇందిరమ్మ ఇంటి కమిటీలకు గురువారం అవగాహన కల్పించారు.



వనపర్తిలో మాట్లాడుతున్న యాదయ్య

వనపర్తి రూరల్ : ఈ నెల 21 లోపు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఎంపికను పూర్తి చేయాలని అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) యాదయ్య అన్నారు. గురువారం వనపర్తి మండల పరిధిలోని చిట్యాల రైతు వేదికలో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలోని ఇందిరమ్మ కమిటీ సభ్యులకు, గ్రామ పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లకు, పంచాయతీ కార్యదర్శులకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులపై అవగాహన కల్పించారు.

అర్హతకు మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు

ఆత్మకూరు, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : అర్హతకు మించి వైద్యం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని 8 ప్రైవేటు ఆసుపత్రులు, రెండు దంత వైద్యశాలలు, 8 ల్యాబ్‌లను శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేసి మాట్లాడుతూ... ఎంబీబీఎస్, ఎమ్మెస్ అర్హతలు లేకుండానే కొంతమంది ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆపరేషన్లు నిర్వహిస్తున్నారని సమాచారం ఉందని తెలిపారు. వారి అర్హతను బట్టి మాత్రమే వైద్యం నిర్వహించాలి అదే విధంగా పట్టణ కేంద్రంలో కొన్ని ల్యాబ్‌లు వైద్య శాలలకు అనుసంధానంగా ఉంచుకుని రక్త నమూనాలు సేకరించి రోగికి లేని రోగాలను ల్యాబ్ పత్రాల ద్వారా సూచిస్తు వైద్యం నిర్వహిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. కొందరు పట్టణ కేంద్రంలో ఎంబీబీఎస్ చదివి చిన్న పిల్లల వైద్యులుగా చలామణి అవుతున్నారని, తెలిసి తెలియని వైద్యం నిర్వహిస్తే చిన్న పిల్లలకు వైద్యం వికటించి ప్రాణాలకు ప్రమాదం ఏర్పడే దుస్థితి ఏర్పడుతుందన్నారు. వంశీకృష్ణ, రాజు, రవి పాల్గొన్నారు.



రోగి పరిస్థితిని పరిశీలిస్తున్న జిల్లా వైద్య అధికారి

గ్రామ పంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలి



జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామ పంచాయతీ వర్కర్లు

వనపర్తి టౌన్, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఒకరోజు టోకెన్ సమ్మె జిల్లా కేంద్రంలో నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాల నుంచి ర్యాలీగా వెళ్లి పాత కలెక్టరేట్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం ఇచ్చారు. ఏదుట్ల కురుమయ్య, రాజు, గణేష్, రామచంద్రయ్య, రాములు, రాజు, గోవిందమ్మ, వెంకటయ్య, గంగమ్మ, పెంటయ్య, నాగమ్మ, దేవమ్మ పాల్గొన్నారు.